సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 11, సెప్టెంబర్, 2023



మట్టి విగ్రహం.. గట్టి నిర్ణయం

చవితి సందడి మొదలైంది. మట్టి విగ్రహాలపై జనం మొగ్గు చూపుతున్నారు.

-8లో



అప్రమత్తతే ఆయుధం

లంపీస్కిన్‌పై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాక్సినేషన్లు పూర్తి చేశారు.

-8లో

కాలభైరవ స్వామికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలా త్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో కాలభైరవ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

జాబ్‌మేళా రేపు



ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పీబీ సాయిశ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్లలోని స్కిల్ కళాశాలలో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, 30 ఏళ్ల లోపు యువత అర్హులని తెలిపారు. విశాఖపట్నం, భీమవరం, ఈస్ట్ గోదావరి కేంద్రాలుగా పనిచేస్తున్న ఆదిట్రేడర్స్ కంపెనీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తోందని తెలిపారు. డిగ్రీ యువత అర్హులు కాగా, మొదటి మూడు నెలలు రూ. 10 వేలు, తర్వాత రూ. 15 వేలు నుంచి రూ. 18 వేల వరకు వేతనం లభిస్తుందని అన్నారు. పూర్తి వివరాలకు అర్హులైన యువత ఫోన్ నంబర్ 9703460880ను సంప్రదించాలని తెలిపారు.

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసిన డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.గణపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న పి.మురళీకృష్ణ నుంచి ఈ బాధ్యతను తీసుకున్నారు. డీఆర్‌ఓగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయనను కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, ఇతర సెక్షన్ల సూపరింటెండెంట్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుడి తిరువీధి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.


అభాగ్యురాలిని ఆదుకున్నారు

కాశీబుగ్గ: తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఒంటిపై వస్త్రాలు కూడా లేని స్థితిలో ఉన్న యాచకురాలిని లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస క్యాజులాండ్ వనిత విభాగం వారు ఆదుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పలాస ప్రభుత్వ 108 అంబులెన్సు సమాచారం మేరకు పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఆమెను కాపాడారు. 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకువచ్చి ఆమెకు నూతన దుస్తులు వేసి వైద్యం అందించారు. కొన్ని గంటల అనంతరం సెలైన్ బాటిల్స్ ఎక్కించి ఇంజెక్షన్లు ఇవ్వడంతో ఆమె కోలుకున్నారు. అనంతర ఆమెకు అవసరమైన వస్తువులు, దుస్తులు, భోజనం అందజేశారు.



యాచకురాలికి సపర్యలు చేస్తున్న లయన్స్ వనితా విభాగం సభ్యులు

నెక్స్ట్.. అచ్చెన్న టికెట్!



వ్యవస్థలను మేనేజ్ చేసే కాలం పోయింది. తప్పు చేసినా తనవారి అండతో తప్పించుకుని తిరిగే రోజులు పోయాయి. చట్టంలోని లొసుగులను వాడుకుని బతుకంతా దర్యాప్తుల నుంచి తప్పించుకున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దొరికిపోయారు. చంద్రబాబుకు రిమాండ్ విధించడంపై జిల్లాలోని రాజకీయ వర్గాలు స్పందిస్తున్నాయి. చట్టం ముందు అందరూ ఒక్కటేనని అంటున్నాయి. ఇదే కుంభకోణంలో జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు కూడా నిందితుడే. చంద్రబాబు అరెస్టు తర్వాత అందరి కళ్లు అచ్చెన్నపై పడ్డాయి.

- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు
- అదే కుంభకోణంలో అచ్చెన్న కూడా నిందితుడే
- ఇప్పటికే ఈఎస్‌ఐ స్కామ్‌లో అరెస్టయి బెయిల్‌పై ఉన్న అచ్చెన్నాయుడు
- సామాజిక మాధ్యమాల్లో అచ్చెన్న ఆడియో లీక్ వైరల్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును రిమాండ్‌కు పంపడంతో అందరి కళ్లు శ్రీకాకుళం వైపు తిరుగుతున్నాయి. అదే కేసులో మరో నిందితుడిగా ఉన్న మన జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడుపై అందరి దృష్టి పడింది. ఇప్పటికే ఈఎస్‌ఐ కుంభకోణంలో అరెస్టై, బెయిల్‌పై ఉన్న అచ్చెన్నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలోనూ కీలక పాత్ర పోషించారు.

అచ్చెన్న వంతు..

చంద్రబాబు తరహాలో అచ్చెన్నాయుడు కూడా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. అటు రాష్ట్ర స్థాయిలోనూ, ఇటు జిల్లా స్థాయిలోనూ దోపిడీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అడ్డొచ్చిన అధికారులను బెదిరించడం, అవసరమైతే బదిలీ చేయడం, తనకు కావాల్సిన వారిని తెప్పించుకుని అక్రమాలు పాల్పడటం వంటివి టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం సాగిపోయాయి. ఇప్పుడవన్నీ బయటికొస్తున్నాయి. కార్మికుల సొమ్మును కాజేసిన కేసులో అచ్చెన్నాయుడు ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై ఉన్నారు. కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన మందు బిల్లులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో రూ. 150కోట్లకు పైగా స్కామ్ చేసిన విషయం తెలిసిందే. వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పనులు నామినేషన్‌పై అప్పగించాలని మాజీ మంత్రి టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సిఫారసు లేఖ ఆధారంగా విజిలెన్స్, ఏసీబీ అధికారులు చేపట్టిన విచారణలో అన్నీ బయటపడ్డాయి. వైద్య పరికరాలు, ఔషధాలను బేరమాడి తక్కువకు కొనాల్సింది పోయి సగటున 132శాతం అధికంగా చెల్లించి కొన్నారంటే నాటి అవినీతి బాగోతం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర స్థాయిలోనే కాదు జిల్లాలో కూడా పెద్ద ఎత్తున అవినీతి చేశారు. టీడీపీ హయాంలో నీరు చెట్టు, చంద్రన్న భీమా, సాగునీటి ప్రాజెక్టుల అంచనాల రూపకల్పన, వివిధ అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. గ్రానైట్, ఇసుక కుంభకోణాలు, బీసీ కార్పొరేషన్ రుణాల్లో అక్రమాలు, సింగిల్ టెండర్ విధానంతో సొంత అన్నకు టెండర్లు కట్టబెట్టడం, ధాన్యం రవాణాకు వచ్చిన కోట్లాది రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, మినుముల కుంభకోణంతో కోట్ల రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, టెక్కలిలో సింగిల్ టెండర్ విధానంతో తన బినామీ లాడి శ్రీనివాసరావుకు ఆర్టీసీ టెండర్లు కట్టబెట్టడం, కేశినేని, దివాకర్ ట్రావెల్స్‌కు అడ్డగోలుగా రవాణా లైసెన్సులు జారీ చేయడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. వీటన్నింటిని నుంచి ఎప్పటికప్పుడు తప్పించుకుని తిరుగుతున్న అచ్చెన్నాయుడు బాగోతం స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతో మరోసారి బయటపడింది.

పార్టీ పరువు గంగపాలు

అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలే కాదు జిల్లా పరువును.. చివరికి ఆ పార్టీ పరువును తీసేయడంలో కూడా అచ్చెన్నాయుడు ముందున్నారు. ఇప్పటికీ 'పార్టీ లేదు..బొక్కా లేదు...ఆడే (లోకేష్) బాగుంటే పార్టీకి ఈ పరిస్థితి ఎందుకు' అంటూ పార్టీ పరిస్థితిని తేటతెల్లం చేసిన అచ్చెన్నాయుడు తాజాగా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ప్రజా స్పందన కొరవడిందని మనసులో మాటలను బయట పెట్టి సంచలనమయ్యారు. ప్రజల నుంచి స్పందన రావడం లేదని, పార్టీ శ్రేణులు సైతం ముందుకు రావడం లేదని, బలవంతపు జన సమీకరణ చేయాలని సెల్ కాన్ఫరెన్స్ ద్వారా తన పార్టీ పరువును, దుస్థితిని తానే నాయకులకు వివరించారు. చంద్రబాబు అరెస్టైనా రోడ్ల మీదకు రావడం లేదంటూ ఆక్రోశం చూపించారు. ఆ ఆడియో లీక్ అయి సోషల్ మీడియాలో సంచలనమైంది.

న్యాయం గెలిచింది



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో న్యాయమే గెలిచింది. చంద్రబాబు నాయుడు చేసిన ఆర్థిక నేరం క్షమించరానిది. సుప్రీం కోర్టు న్యాయవాదిని అధిక ఫీజులు ఇచ్చి ఢిల్లీ నుంచి రప్పించినప్పుడే చంద్రబాబు నేరం అంగీకరించినట్లు రుజువైంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

చట్టం మన చుట్టం కాదు



ప్రజాధనాన్ని అడ్డగోలుగా కొల్లగొట్టిన వారికి చట్టం చుట్టం కాదనే విషయం తేటతెల్లమైంది. చంద్రబాబునాయుడుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించడం ద్వారా ప్రజాస్వామ్యానికి న్యాయం జరిగింది. – నర్తు రామారావు, ఎమ్మెల్సీ

తీర్పు సరైనదే..



చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడం సరైన తీర్పు. చంద్రబాబు అవినీతి బాగోతాలు ఎన్నో ఉన్నాయి. అన్ని ఆధారాలతో సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసింది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగింది



చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు ఇవ్వడంతో ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం పెరిగింది. ఎన్నో దశాబ్దాలుగా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాజకీయం చేసిన చంద్రబాబు ఇప్పుడు దొరికారు.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

చట్టానికి ఎవరూ అతీతులు కారు



చట్టానికి ఎవరూ అతీతులు కారు. ప్రభుత్వం, ప్రజల ధనం ఎవరు కాజేసినా చట్టం తన పని తాను చేసుకుంటుంది. బుకాయిస్తే చెల్లదు. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని ఏపీ సీఐడీ స్పష్టమైన ఆధారాలు సేకరించి అరెస్టు చేసింది. ఇప్పటికీ ఆయన బుకాయిస్తే ఎవరూ నమ్మరు. – ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

కౌంట్‌డౌన్ ఆరంభం



చంద్రబాబు తన రాజకీయ జీవితంలో చేసిన అనేక రకాల అవినీతి అక్రమాలకు ఈ రోజు విధించిన రిమాండ్ తగిన శిక్ష. దీంతో ఆయన అవినీతి అంతానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

– డాక్టర్ కిల్లి కృపారాణి, కేంద్ర మాజీ మంత్రి

చట్టం దృష్టిలో అందరూ సమానులే



పేదవాడైనా ప్రజా ప్రతినిధి అయినా చట్టం దృష్టిలో అంతా సమానమే. ఈ తరహా ఘటనల్లో పేదోడైనా, పెద్దోడైనా చట్టం దృష్టిలో ఎవ్వరూ అతీతులు కారు. శిక్షను కచ్చితంగా అనుభవించి తీరాల్సిందే.

– పిరియా సాయిరాజ్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త

తగిన గుణపాఠం



అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు చేసిన అవినీతి అక్రమాలకు ఎందరో బలయ్యారు. ఇన్నాళ్లకు ఆయన అడ్డంగా దొరికారు. న్యాయమే అంతిమంగా గెలిచింది.

– దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త

ఒత్తిడి లేని విద్య



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్

- విద్యార్థులను ఆకట్టుకుంటున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ
- ఇంజినీరింగ్ దిశగా ప్రత్యేక ప్రణాళిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సకల సదుపాయాలతో విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుత తరం విద్యార్థుల కల అయిన ఇంజినీరింగ్‌ను అందించేందుకు ఉన్నతస్థాయి విద్య అందజేస్తోంది. నైపుణ్యం గల ఇంజినీర్లను తయారు చేయడం ఈ విశ్వ విద్యాలయం ప్రత్యేకత. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు చాలా ప్రత్యేకమైనది. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఈ ఏడాది ప్రవేశాలు పూర్తయ్యాయి. 1100 మందికి ప్రవేశాలు కల్పించారు. మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభమైంది. ట్రిపుల్ ఐటీలో ఇంటర్మీడియెట్‌కు బదులుగా పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు) నిర్వహిస్తున్నారు. పీయూసీ కోర్సు అన్నది విద్యార్థులను ఇంజినీరింగ్‌కు సిద్ధం చేసేలా ఉంటుంది. రెండేళ్ల పీయూసీలో నాలుగు సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌తో పాటు గ్రూప్ సబ్జెక్టులు గణితం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రంలతో పాటు, ఇంజినీరింగ్‌కు ఉపయోగపడే



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ సబ్జెక్టులు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంగ్లిష్‌లో వెనుకబడి ఉండటం వల్ల వీరికి కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో వీరు ఒత్తిడి లేకుండా చదువుతారు. ఇక్కడ ఇంజినీరింగ్ రిలీవ్ అయ్యే నాటికి రూ.10 లక్షల నుంచి రూ.50లక్షలు దాటి ప్యాకేజీ సాధిస్తున్నారు. వీరికి ప్రభుత్వం సైతం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అర్హులైన వారికి వర్తింపజేస్తుంది. వసతి, భోజనం సౌకర్యాలతో పాటు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తుంది.

ఇంజినీరింగ్‌కు సన్నద్ధం



రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యా విధానంలో ఒత్తిడి ఉండదు. రెండేళ్ల పీయూసీ కోర్సులో విద్యార్థులను ఇంజినీరింగ్‌కు సన్నద్ధం చేస్తాం. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు కావాల్సిన విషయ పరిజ్ఞానం పీయూసీలో సాధిస్తారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్, కంప్యూటర్ స్కిల్ పూర్తిస్థాయిలో సాధిస్తారు. ఇంజినీరింగ్‌లో చేరిన వెంటనే వారు ఒత్తిడి లేకుండా సబ్జెక్టుపై పట్టు సాధిస్తారు.

– ప్రొఫెసర్ కేసీ రెడ్డి, చాన్స్‌లర్, ఆర్‌జీయూకేటీ

ఉత్సాహంగా జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



వివిధ వయో విభాగాల్లో విజేతలుగా నిలిచి పతకాలు అందుకున్న క్రీడాకారులతో అతిథులు, తైక్వాండో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 13వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2023 పోటీలు ఆదివారం జరిగాయి.

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది వరకు క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. క్యాడెట్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ వయో విభాగాల్లో వివిధ కేటగిరీల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సలహాదారు పి.సుందరరావు, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.హారికాప్రసాద్, సెయింట్‌పాల్స్ ప్రిన్సిపాల్ నారాయణరావు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సనపల నారాయణరావు, బాణ్న రాము, గేదెల ఇందిరాప్రసాద్ తదితరులు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకుముందు ఉదయం వీరంతా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, రెడ్డి శివకుమార్, సత్యప్రసాద్, తారకరామ, మోహన్‌కృష్ణ, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి శ్రావణ పూజలు



ధర్మపథంలో భాగంగా ఆదిత్యహృదయాన్ని పఠిస్తున్న అగనంపూడి పారాయణదారులు

- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

అరసవల్లి: శ్రావణ ఆదివారం సందడితో అరసవల్లి క్షేత్రం ప్రత్యేకంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చర్యలు చేపట్టారు. అంతరాలయంలో ప్రతి భక్తునికి సజావుగా దర్శనాన్ని కలిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం చర్యలు చేపట్టారు. వీవీఐపీలతో పాటు జిల్లా స్థాయి అధికారుల తాకిడితో శ్రావణ ఆదివారం ప్రత్యేకంగా కనిపించింది. ఒక్కరోజులో దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,15,400, విరాళాలు, పూజల ద్వారా రూ.79,355, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. సాయంత్రం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా అగనంపూడి వాస్తవ్యులు శ్రీభ్రామరాంబ పారాయణ సేవా సమితి వారి ఆదిత్య హృదయం, లలితా సహస్రనామార్చనలు, విష్ణు పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో అనివేటి మండపంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. అలాగే రూ.30 వేల విలువైన ఎలక్ట్రికల్ మేళం హారతి డ్రమ్ సెట్‌ను స్థానిక వ్యాపారి హనుమంతు మురళీధర్ ఆదివారం ఉదయం ఆలయానికి సమర్పించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ పూజలను చేయించి ఎలక్ట్రికల్ డ్రమ్‌ను స్వీకరించారు.

కరాటే పోటీల్లో హర్షిత ప్రతిభ



పలాస: పలాస మండలం రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో పదో తరగతి చదువుతున్న హర్షితకు జిల్లా స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ లభించింది. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ఆమె అండర్-55లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో విద్యార్థిని సత్యసాయి ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, కోచ్ లోకేష్, శ్రీను, శరత్ అభినందించారు.

పట్టుసాగుతో రైతులకు అధిక ఆదాయం

పొందూరు: పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని పట్టు పరిశ్రమ శాఖ(గుంటూరు) అడిషనల్ డైరెక్టర్ సి.అరుణ కుమారి అన్నారు. మండలంలోని రాపాక, మలకాం గ్రామాల్లో ఆదివారం 'పట్టుబడి' శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సాగుచేస్తున్న మల్బరీ సాగును పరిశీలించారు. రాపాక, మలకాం గ్రామాల్లో కొత్తగా నిర్మించిన పట్టు పురుగులకు సంబంధించిన చాకీ రేరింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి టి.రాజేంద్రప్రసాద్, సీహెచ్ కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



మలకాంలో పట్టుపురుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఏడీ అరుణకుమారి

టీడీపీ దీక్షలో సీఐకు గాయాలు



టెక్కలిలో టీడీపీ శ్రేణుల దీక్ష వద్ద గాయపడిన సీఐ సూర్యచంద్రమౌళి

టెక్కలి: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎలాంటి అనుమతి లేకుండా టెక్కలిలో టీడీపీ శ్రేణులు ఆదివారం రిలే దీక్షలు నిర్వహించారు. అయితే ఎలాంటి అనుమతులు లేకపోవడం, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఆ దీక్షను భగ్నం చేశారు. ఈ క్రమంలో దీక్ష కోసం ఏర్పాటు చేసిన టెంటు కర్ర తగిలి టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి తలపై గాయమైంది. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. మిగిలిన పోలీస్ సిబ్బంది రంగ ప్రవేశం చేసి టీడీపీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

జ్ఞాపకాల జల్లు



కలిసిన పూర్వ విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 1988లో టెన్త్ చదివిన వారు ఆదివారం ఓ కల్యాణ మండపం వేదికగా మళ్లీ కలిశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సినీ నటుడు ప్రభాస్ శ్రీను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 80 మందికి పైగా పూర్వ విద్యార్థులు వచ్చారు.

రిమ్స్‌లో ఆత్మహత్యల నివారణ దినోత్సవం



ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

శ్రీకాకుళం: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రిమ్స్‌లోని నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భారీ ర్యాలీ చేశారు. 'క్రియేట్ ఎవేర్‌నెస్ త్రూ యాక్షన్' పేరిట ఈ ర్యాలీని రిమ్స్ నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రాణాల విలువను తెలుసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘంలో శ్రీకాకుళానికి అందలం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) నూతన కార్యవర్గ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట లభించింది. విశాఖపట్నంలో ఆదివారం ఏపీ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎప్పటిలాగే శ్రీకాకుళం జిల్లాకు సముచిత స్థానాన్ని కట్టబెట్టారు. ఏపీఏఏ రాష్ట్ర అధ్యక్షునిగా కొన్న మధుసూదనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నొపడ విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా మెంటాడ సాంబమూర్తి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా కచ్చి హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



చిన్నారావు భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలం శ్రీజగన్నాథపురం పంచాయతీ పాడుగుపాడు గ్రామానికి చెందిన తిర్లంగి చిన్నారావు డెంగీ సోకి ఇటీవల హైదరాబాద్‌లో మరణించాడు. మరణ వార్త తెలుసుకున్న జర్జంగి హైస్కూల్ 1999–2000 బ్యాచ్ విద్యార్థులు చిన్నారావు కుటుంబాన్ని ఆదుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఆదివారం చిన్నారావు భార్య సునీతకు రూ.92వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గుంట సోమేశ్వరరావు, గొండు నారాయణరావు, చాప ఉషారాణి, చాప అప్పలనాయుడు, కోన కోటేశ్వరరావు, పేడాడ మోహనరావు, మెట్ట వాసుదేవరావు, గంగిట్ల మోహనరావు పాల్గొన్నారు.

మట్టి విగ్రహం.. గట్టి నిర్ణయం

- మార్కెట్‌లో మట్టి గణేశుని విగ్రహాల శోభ
- ఊరూరా విగ్రహాల తయారీ
- వినాయక పందిళ్లకు పోలీసు అనుమతి తప్పనిసరి
- 18 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు



వినాయక విగ్రహాలు సిద్ధం చేస్తున్న తయారీదారులు

శ్రీకాకుళం కల్చరల్, ఎచ్చెర్ల క్యాంపస్: వినాయక చవితి సంబరం దగ్గరపడుతోంది. భాద్రపద శుద్ధ చవితి నాడు అనగా ఈ నెల 18నుంచి ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. వేడుకల కోసం ఊరూవాడా వేదికలు సిద్ధం చేస్తున్నాయి. ఇన్నాళ్లుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలనే ఎక్కువగా చవితి వేడుకకు ఉపయోగించిన జనం ఇప్పుడు మాత్రం మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ మట్టితో తయారుచేస్తున్న వినాయక విగ్రహాలకు గత కొన్నాళ్లుగా తయారీ వ్యయం పెరిగింది. ప్రస్తుతం ట్రాక్టరు మట్టి కొనుగోలు చేయాలంటే రూ.1500 నుంచి రూ.2వేల వరకు ఖర్చు అవుతోంది. ఇంకా రంగుల కోసం ఖర్చు కలుపుకొని ఒక బొమ్మ తయారీకి రూ.500 నుంచి రూ.5వేలు వరకు సైజును బట్టి ఖర్చవుతోంది. విగ్రహాల తయారీకి రుణాలు ఇస్తే ఎంతో బాగుంటుందని కొందరు తయారీ దారులంటున్నారు.



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

సుందరంగా..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ మట్టి విగ్రహాల్లో ఉండే కళ వేరు. ప్రస్తుతం రసాయనాలతో తయారు చేస్తున్న బొమ్మలకు దీటుగా మట్టి విగ్రహాలను కూడా జిల్లాలో కొందరు తయారు చేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడా కొందరు విగ్రహాల తయారీదారులు టెంట్లు వేసుకుని మూడు నెలలుగా ఇదే పనిలో ఉన్నారు.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయం



మా తాతముత్తాతల కాలం నుంచి బొమ్మలు తయారు చేస్తున్నాం. నేటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలకు దీటుగా మట్టి బొమ్మలు తయారు చేస్తున్నాం. ఖర్చులు పెరిగాయి. లాభాల మాట అటుంచితే తయారైన బొమ్మలు అమ్ముడైతే చాలని చూస్తున్నాం.

– వెంకటరావు, తయారీదారు

కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి



రాజస్థాన్ నుంచి చిలకపాలేం వచ్చి ఆరు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ ప్రారంభించాం. చాలా వరకు వివిధ ఆకృతుల్లో సిద్ధం చేస్తున్నాం. కొనుగోలుదారులు అడ్వాన్సులు ఇచ్చి వెళుతున్నారు. మొత్తం పది రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నాం.

– పోఖర్జీ, విగ్రహాల తయారీదారు, రాజస్థాన్

వసతి గది నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం



రూ.2.50 లక్షల విరాళాన్ని ఈఓకు అందజేస్తున్న దాత శంకరరావు దంపతులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల వసతి కోసం నూతన భవన నిర్మాణానికి నగరానికి చెందిన సూరు శంకరరావు, అరుణజ్యోతి దంపతులు ఆదివారం రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళ నగదును ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి సమక్షంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. దివంగతులైన తన తల్లిదండ్రులు సూరు సత్యన్నారాయణ, దమయంతమ్మల జ్ఞాపకార్థం ఈ గది నిర్మాణానికి విరాళమిస్తున్నట్లుగా దాత శంకరరావు ప్రకటించారు.

ఈ సందర్భంగా ఈఓ హరిసూర్యప్రకాష్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దాతలకు రశీదును అందజేస్తామని, అలాగే రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనానికై డోనర్ పాస్‌ను అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత అంధవరపు ప్రసాద్, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భవానీ నగర్‌లో చోరీ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని చాపురం పంచాయతీ పరిధిలోని భవానీనగర్‌లో జరిగిన చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఇచ్చిన వివరాల మేరకు.. స్థానికంగా నివాసం ఉంటున్న సింహాద్రి వెంకటరమణ పెదపాడులో మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న రాజాంలోని తన అత్తవారి ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ముందు డోర్ గడియ విరగ్గొట్టి కనిపించడంతో రూరల్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన క్లూస్‌టీమ్ పరిశీలించగా ఇంటిలో గల 4 తులాలు బంగారం, రూ.20వేలు నగదు పోయినట్లు బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సైనికుల ఆత్మీయ కలయిక



3వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ ఆత్మీయ కలయికలో పాల్గొన్న మాజీ సైనికులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో 3వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు మాట్లాడుతూ 1965 ఆపరేషన్ రిడిల్ వార్‌ను గుర్తు చేసుకుంటూ ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత బ్రిగేడియర్ సహనవాజ్, విశ్రాంత కల్నల్ బీఎస్ రావు, హానరరీ కెప్టెన్ జి.టి.రావు, సుబేదార్ కె.ఎల్.రావు, హవాల్దార్ బి. ఈశ్వర రావు, హవాల్దార్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వలంటీర్ల జీతాలు పెంచాలి'



ఉత్కళ సమ్మేళని రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఏపీ ఒడియా భాషాభివృద్ధి సంఘం నాయకులు

కవిటి:

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఒడియా విద్యావలంటీర్లకు అందిస్తున్న గౌరవ వేతనాలు పెంచాలని ఒడిశాకు చెందిన ఉత్కళ్ సమ్మేళని సంస్థను స్థానిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం భువనేశ్వర్‌లో ఉత్కళ్ సమ్మేళని అధ్యక్షుడు డాక్టర్ అద్వైత్‌కుమార్‌పాత్రో, ప్రధాన కార్యదర్శి రవీంద్రకుమార్ మిశ్రోలను ఏపీ ఒడియా మీడియం విద్యాశాఖ ప్రతినిధి బృందం సభ్యులు కలిసి సమస్యలను విన్నవించారు. ప్రధానంగా ఏపీలో పనిచేస్తున్న ఉత్కళ్ సమ్మేళనికి చెందిన 130 మంది వలంటీర్లకు వేతనాల పెంపు, పాఠ్యపుస్తకాల సరఫరా తదితర అంశాలకు సంబంధించిన విషయాలపై ఈ భేటీలో ప్రస్తావించారు.

అలుపెరుగని పోరాట యోధుడు కుమారన్న



సభలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు సవర నారాయణరావు

పలాస:

అలుపెరుగని గొప్ప పోరాట యోధుడు కామ్రేడ్ కుమారన్న అని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. పలాస మండలం లొత్తూరు గ్రామంలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న 25వ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. కుమారన్న, సీతారాములు చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజా గాయకుడు, రచయిత కుత్తుం వినోద్ రాసి ఆలపించిన కుమారన్న స్మృతి గీత క్యాసెట్‌ను ఆవిష్కరించారు. గిరిజన సంఘం నాయకుడు ఎస్.నారాయణరావు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా కుమారన్న కుమారుడు మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సభలో జనశక్తి నాయకుడు కె.గురయ్య, రాపాక మాధవరావు, గొరకల బాలకృష్ణ, మాజీ సర్పంచి మోహన్, సీమోన్, పి.దానేసు, బొడ్డు వాసు, మహిళా సంఘం నాయకులు పి.కుసుమ, కుత్తుం హేమమ్మ, తెప్పల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన కుమారన్న వర్ధంతి సభలో ఆయనతో పాటు ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, అరుణోదయ నాయకులు కె.సోమేశ్వరరావు, బైరి కూర్మారావు, బదకల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొని కుమారన్నకు జోహార్లు అర్పించారు. గిరిజన సంఘం నాయకుడు సవర బంగ్లా అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.రాజు, వినోద్, ఎం.తాతారావు, మామిడి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, కోచ్ అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బాస్కెట్ బాల్ బాల్ జట్టు ఎంపికలు ముగిశాయి. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా శనివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన ఎంపిక పోటీల్లో జట్టును ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి సారిగా 3,3 (ఒక్కో జట్టులో ముగ్గేసి చొప్పున ఆడటం) పేరిట రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు.

సీనియర్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు విజయవాడ వేదికగా ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా జట్టు ఎంపికలను జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ప్రారంభించారు. దగ్గరుండి ఎంపికలను పర్యవేక్షించారు. క్రీడాకారులకు పలు సూచనలు అందిస్తూ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, సీహెచ్ గణేష్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్టు

ఐ.సంతోష్ కుమార్, ఎ.అశోక్ కుమార్, పి.లీలాకృష్ణ, కె.జయకృష్ణ. స్టాండ్ బైగా ఎం.జశ్వంత్, బి.కులదీప్ ఎంపికయ్యారు.

చాంబర్ ఆఫ్ కామర్స్‌లో గీతాశ్రీకాంత్‌కు చోటు



యార్లగడ్డ గీతాశ్రీకాంత్‌ను అభినందిస్తున్న భాస్కరరావు

శ్రీకాకుళం అర్బన్:

ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి విజయవాడలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పరిధిలో మహిళా పారిశ్రామిక వేత్తల వృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారని, మహిళలు పారిశ్రామిక వేత్తలుగా విజయం సాధించేందుకు నిత్యం అవగాహన కార్యక్రమాలు, మార్కెటింగ్ మెలకువలను చేరువ చేస్తూ జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించడంపై గీతాశ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం

- లంపీ స్కిన్ వ్యాధిపై జాగ్రత్త అవసరం
- జిల్లాలో 3.65 లక్షల వ్యాక్సినేషన్లు పూర్తి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

మూగజీవాలకు లంపీస్కిన్ వ్యాధి మళ్లీ ప్రబలుతోంది. ఉత్తర భారతదేశంలో ప్రస్తుతం వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. అయితే అధికారుల ముందు జాగ్రత్తతో జిల్లాలో వ్యాధి ప్రబలలేదు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 3.65 లక్షల వ్యాక్సినేషన్లు పూర్తి చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 1962 వాహనాల ద్వారా ప్రతి ఒక్క పాడి రైతుకు ప్రతిక్షణం సేవలు అందిస్తోంది. వానాకాలంలో తడి ఎక్కువగా ఉండటం వల్ల లంపీస్కిన్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని పశువైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి పశువులకు ప్రాణాంతకమైనది కాకపోయినా, పశువుల ఉత్పత్తి సామర్థ్యం, వ్యాధి నిరోధక శక్తి తగ్గి, రైతులకు నష్టం కలిగిస్తుంది.

ఎలా వ్యాపిస్తుంది..?

- ఇది ప్రధానంగా పశువులను ఆశించు కీటకాల ద్వారా వ్యాపిస్తుంది. జోరీగ, ఇతర రక్తం పీల్చు ఈగలు, దోమల ద్వారా వైరస్ వ్యాప్తి చెందుతుంది.
- కరిచే ఈగల ద్వారా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువు బయట మేత మేసేటపుడు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతంలో వ్యాధి ప్రబలుతుంది.

నివారణ చర్యలు

- వ్యాధి నిరోధక టీకా వేసుకోవడం తప్పనిసరి.
- జిల్లాలోగల 9 పశువుల సంతల్లో ఈ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్నారు.
- గ్రామాలు, పట్టణాల్లో పరిసరాల పరిశుభ్రతకు అందరు గ్రామ పంచాయతీ సెక్రటరీలకు తగు సూచనలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను కోరారు.
- 94411603694, 9989932801 నంబర్లకు కాల్ చేసి సహాయం తీసుకోవచ్చు.

వ్యాక్సినేషన్ పూర్తి చేశాం



ఈ వ్యాధి అంత ప్రాణాంతకమైంది కాదు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని అదుపు చెయ్యవచ్చు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గోట్ పాక్స్ వాక్సిన్ 3.65లక్షల ఆవులకు ఇచ్చాం. ఈ వ్యాధి సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఒకవేళ ఎక్కడైనా పశువులకు వ్యాధి సోకితే వెంటనే పశువైద్యులను సంప్రదించి మందులు వాడాలి.

– డాక్టర్ ఎం.కిషోర్, పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు, శ్రీకాకుళం.

'కుప్పిలి'కి జాతీయ స్థాయి రికార్డు పురస్కారం

ఆమదాలవలస: కరీంనగర్‌కు చెందిన ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థలు సంయుక్తంగా గతంలో నిర్వహించిన ఒక గంటలో రెండు కవితలు అనే పోటీలో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావు జాతీయ స్థాయి రికార్డు లభించింది. ఈ మేరకు ఆదివారం ఆయనకు ధ్రువీకరణ పత్రం, బంగారు పతకంతో సత్కరించారు. అలాగే ఆమదాలవలసకు చెందిన పద్య కవి కర్నేన జనార్దనరావుకూడా ఈ పురస్కారం అందుకున్నారు

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220



మునగవలస వద్ద వెన్ను దశలో ఉన్న వరి పంట.

వడి వరిగా..

మండలంలో మునగవలస, జొన్నవలస, రామచంద్రాపురం గ్రామాల్లో వరి చేతికి వచ్చేసింది. వీరు 135 రోజులకు దిగుబడి వచ్చే రకాన్ని వేయడంతో ముందుగానే పంట చేతికి వచ్చింది. తేలిక రకం వరి విత్తనాలు నెల రోజుల ముందే వెన్ను రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దీపావళి పండగ తర్వాత వరి కోతలు జరుగుతుంటాయి. ఈ రకంతో ముందుగానే కోతలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురిసినా పంటకు నష్టం వాటిల్లదని రైతులు భావిస్తున్నారు.

– ఆమదాలవలస రూరల్